సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం । 14 । ఆగస్టు । 2025



నేటితో ముగింపు - 8లో▸

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గడువు నేటితో ముగియనుంది. అయితే గతంలోనే కాలపరిమితి పెంచడంతో ఈసారి పెంచుతారా.. లేదా..అనే సందిగ్ధం నెలకొంది.



అంబులెన్స్ తరహా సేవలు - 8లో▸

విద్యుత్ అంతరాయాల నివారణ, పునరుద్ధరణకు టీజీ ఎన్పీడీసీఎల్ అంబులెన్స్ తరహా సేవలకు సిద్ధమైంది.

గరిష్టం/కనిష్టం
$27^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరుజల్లులు కురుస్తాయి. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సైలెన్సర్లు మారిస్తే క్రిమినల్ చర్యలు

- ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ



వరంగల్ క్రైం: సైలెన్సర్లు మార్చి వాహనం నడిపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ వాహనదారులను హెచ్చరించారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను కొన్నాళ్ల నుంచి స్వాధీనం చేసుకుంటున్నారు. ఈక్రమంలో వాటితో రాకెట్ నమూనా తయారు చేసి కమిషనరేట్ కార్యాలయం ఎదుట జంక్షన్‌లో పైలాన్‌ను బుధవారం ట్రాఫిక్ ఏసీపీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు ట్రై సిటీ పరిధిలో 2024లో 1,246 సైలెన్సర్లు, 2025 ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 592 అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

- డీఆర్‌ఓ వై.వీ గణేష్



హన్మకొండ అర్బన్: సమాజానికి తీవ్రమైన సమస్యగా మాదకద్రవ్యాల వినియోగం మారిందని, దానిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ గణేష్ మాట్లాడుతూ జీవితాన్ని చెడగొట్టే అలవాట్లకు బదులుగా లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో డీడబ్ల్యూఓ జయంతి, డీఆర్డీఓ మేన శ్రీను, జెడ్పీ సీఈఓ విద్యాలత, మెప్మా అధికారి రజిత రాణి, డీపీఓ లక్ష్మీరమాకాంత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా రాజ్‌కుమార్


రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్: తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం అధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన సదస్సులో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్‌కుమార్ రెండేళ్లపాటు ఆ పదవిలో ఉంటారు.

పూలే సెంటర్ ఫర్ రీసెర్చ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ డైరెక్టర్‌గా సతీష్


సతీష్

కాకతీయ యూనివర్సిటీ బీసీసెల్, మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ డైరెక్టర్‌గా జియాలజీ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సతీష్‌ను నియమిస్తూ బుధవారం రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న ఆకుతోట శ్రీనివాస్ పదవీకాలం ముగియడంతో ఆ స్థానంలో సతీష్‌ను నియమించారు.

పరిశోధన పత్రాలు, పోస్టర్ల ప్రజంటేషన్



విద్యారణ్యపురి/కమలాపూర్: చెన్నైలో బ్రిటిష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించిన (ఆర్మ్స్ రీసెర్చ్‌మెంటరింగ్ స్కీమ్) పరిశోధన కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాలనుంచి పలువురు రిసోర్స్‌పర్సన్లు (టీచర్లు) పాల్గొని పరిశోధన పత్రాలు, పోస్టర్ల ప్రజంటేషన్ చేశారు. మూడు ప్రధాన సంస్థలు నిర్వహించిన యాక్షన్ రీసెర్చ్ మల్టీ లింగ్వల్ క్లాస్ రూమ్ పరిశోధన అంశాలపై చర్చించారు. కౌన్సిల్ సమావేశంలో ఇంగ్లిష్, ఫిజిక్స్, మ్యాథ్స్, బయోసైన్స్ రిసోర్స్‌పర్సన్‌లు టి.వెంకటేశ్వర్లు లక్ష్మణ్ వంగర, కె.సంపత్‌కుమార్, ఉప్పుల సుమలత, రోజారాణి, బందారు రమేష్, శశికళాధర్ పాల్గొన్నారు.

ఇంకా తేరుకోలేదు..!

రెండు రోజులైనా నగరంలోని పలు కాలనీలను వీడని వరద



- ఈ ఫొటోలో ఉన్నది శివనగర్ డాక్టర్ రవీందర్ లేన్. మంగళవారం అర్ధరాత్రి కురిసిన అతి భారీ వర్షంతో వచ్చిన వరద ఇంకా వీడలేదు. బుధవారం సాయంత్రం వరకు కాలనీ రోడ్లపై వరద ప్రవాహం తగ్గలేదు. ఫలితంగా ఇక్కడి ప్రజలు బయటకు వెళ్లి నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలంటే వరదలో జాగ్రత్తగా అడుగు తీసి అడుగు వేయాల్సిన పరిస్థితి ఉంది. ఎక్కడ విద్యుత్ తీగలు ఉన్నాయో, మ్యాన్‌హోల్స్ ఉన్నాయో తెలియక భయం గుప్పిట్లోనే ఉన్నారు.



- ఈ ఫొటో చూడండి. మైసయ్యనగర్‌లోని ఓ ఇంట్లోకి వరద రావడంతో ఫ్రిడ్జిని స్టూల్‌పై పెట్టి కాపాడుకున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు దంచికొట్టిన వానతో ఇంట్లోకి మొదలైన వరద బుధవారం సాయంత్రమైనా వీడలేదు. రెండు రోజులుగా ఈ ఇంటివాసులు బయటికి వెళ్లలేని పరిస్థితి. ఇంట్లో బియ్యం, ఇతర నిత్యావసరాలు తడిసిపోయాయి. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో తమ పరిస్థితి ఏంటన్న ఆందోళనలో ఆ కుటుంబం ఉంది.

- రోడ్లపై నీరు ఉండడంతో బయటకు వచ్చేందుకు భయం
- నిత్యావసరాలు లేక ఇబ్బందిపడుతున్న లోతట్టుప్రాంతవాసులు
- అసంపూర్తి అభివృద్ధి పనులతోనే అవస్థలంటున్న జనం


వరంగల్ మైసయ్య నగర్‌లో నిలిచిపోయిన వరద

సాక్షి, వరంగల్: వరంగల్ నగరంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వరుణుడు సృష్టించిన వరద బీభత్సం ఇంకా చాలా కాలనీలను వీడలేదు. మంగళవారం రాత్రి వరంగల్‌లో 19 మిల్లీమీటర్లు, ఖిలా వరంగల్‌లో 19.3 మిల్లీమీటర్ల మోస్తరు వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరిపివ్వడంతో నగరంలోని ప్రధాన రహదారుల్లోని నిలిచిన నీరు క్లియర్ అయినా, మైసయ్యనగర్, వివేకానంద కాలనీ, మధురానగర్, పద్మానగర్, శివనగర్, సాకరాశికుంట, నాగేంద్రనగర్, ఎస్ఆర్ తోట, సంతోషిమాత కాలనీలను ఇంకా వరద వీడలేదు. ముఖ్యంగా వర్షపు నీరు బయటకు వెళ్లే స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌లు ఇరుకుగా ఉండడం వల్ల నీటి ప్రవాహంలో ఇబ్బందులు ఏర్పడి రోడ్లపైనే నిలిచిపోతోంది. డ్రెయినేజీలు, రహదారుల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేయడం వల్లే ఈ కాలనీలకు ప్రతీ వర్షాకాలం తిప్పలు తప్పడంలేదనే విమర్శలొస్తున్నాయి. ఖిలా వరంగల్ అగర్త చెరువు వరదనీటి కాల్వల నిర్మాణం, అభివృద్ధి పనుల పేరుతో ఉర్సు చెరువుకట్ట కచ్చా నాలాను మూసివేయడం, అండర్ డ్రెయినేజీ, స్టోర్మ్ వాటర్ డ్రెయినేజీ నిర్మాణం, చేపల బ్రిడ్జి విస్తరణ, పెరికవాడ వరదనీటి కాలువ పనులతోపాటు నాలా విస్తరణ ఆలస్యం వల్లే ఇళ్లలోకి వరద చేరుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ జీవితాలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాతికోట ఉత్తర ద్వారం నుంచి పడమర ద్వారం వరకు నీరు నిలిచి ఉండడంతో అక్కడ సాగుచేసే ఆకుకూరలు, కూరగాయ తోటలు ఇంకా నీట మునిగే ఉన్నాయి. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్లడ్ లైట్లు కూడా వరదలోనే మునిగి ఉన్నాయి.


వరంగల్ శివనగర్‌లో ఇంటిని చుట్టుముట్టిన వరద

ముంపు ప్రాంతాలపై దృష్టి పెట్టాలి



మంగళవారం అర్ధరాత్రి కురిసిన అతి భారీ వర్షంతో 34వ డివిజన్ శివనగర్ పూర్తిగా జలమయమైంది. కనీసం పాలు, కూరగాయలు తెచ్చుకుందామనుకుంటే రోడ్డుపై మోకాలు లోతుతో వరద నీరు పోతోంది. అధికారులు స్పందించి వెంటనే వరద సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. ఆ వెంటనే ముంపు ప్రాంతాల్లో మురుగు తొలగించాలి. లేదంటే ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశముంది.

- బత్తుల సంధ్యారాణి, గృహిణి, శివనగర్

తాగునీరు, పాలకు ఇబ్బంది పడుతున్నాం...



భారీ వర్షానికి రోడ్లపై మూడు ఫీట్ల ఎత్తుతో వరద ప్రవహిస్తోంది. మా ఇళ్లను వరద నీరు ముంచెత్తింది. బయటకు వెళ్లి నిత్యావసర సరుకులు, పాలు, తాగు నీరు తెచ్చుకోలేకపోతున్నాం. రెండో రోజైనా బుధవారం కూడా వరద అలానే ఉంది. ఇంటినుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేదు. బల్దియా అధికారులు కనీసం తాగునీరు అందించలేకపోతున్నారు. ఇప్పటికైనా వాటర్ ట్యాంకర్ ద్వారా సరఫరా చేయాలి.

- ఓరుగంటి విమల, వాసవి కాలనీ

ఉదయం 9.30 గంటలకే పతాకావిష్కరణ

- పంద్రాగస్టు వేడుకలకు ప్రభుత్వం ఉత్తర్వులు
- హనుమకొండకు మంత్రి కొండా సురేఖ.. వరంగల్‌కు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




సాక్షిప్రతినిధి, వరంగల్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం పంద్రాగస్టు రోజున జిల్లాకేంద్రాల్లో ఉదయం 9.30 గంటలకే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల వారీగా వేడుకలకు హాజరయ్యే మంత్రులు/ప్రముఖుల జాబితాను బుధవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు విడుదల చేశారు. హనుమకొండ జిల్లా పోలీసు పరేడ్‌గ్రౌండ్స్‌లో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. వరంగల్‌లో రెవెన్యూశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ములుగులో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. అదేవిధంగా మహబూబాబాద్‌లో డిప్యూటీ స్పీకర్ జె.రామచంద్రునాయక్, జనగామలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జయశంకర్ భూపాలపల్లిలో ఎస్టీ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌లు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. అనంతరం గార్డ్ ఆఫ్ ఆనర్‌లో గౌరవ వందనం స్వీకరిస్తారని, ఏర్పాట్లు చేయాలని చీఫ్ సెక్రటరీ ఆ ఉత్తర్వులో జిల్లా కలెక్టర్‌లకు సూచించారు.

నాలాలు కబ్జా చేస్తే కఠిన చర్యలు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు


కచ్చా నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్, మేయర్, కమిషనర్ తదితరులు

న్యూశాయంపేట: నాలాలు కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పరిధిలోని 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్ 100 ఫీట్ల రోడ్, బాలాజీ నగర్‌లలో కచ్చా నాలా తీస్తున్న ప్రాంతాల్లో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌లతో కలిసి ఆయన పర్యటించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సుమారు 30 కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపొందించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు తెస్తామని, శాశ్వత ముంపునివారణ నిర్మాణాలు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ తుర్పాటి సులోచనా, సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతేయాజ్ పాల్గొన్నారు.

ముంపు నివారణకు ప్రత్యేక చర్యలు

రామన్నపేట: నగరంలో ముంపు నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. బుధవారం వరంగల్ నగర పరిధి చింతల్ మైసమ్మ గుడి వద్ద డ్రెయిన్ నిర్మాణ పనుల్ని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ముంపుప్రాంత వాసుల కోసం ముందస్తుగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి మంచి నీరు, ఆహారం అందజేస్తున్నట్లు తెలిపారు. భద్రకాళి బండ్ ప్రాంతంలో అభివృద్ధి పనులు పూర్తయితే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. ఈనెల 16 వరకు భారీ వర్ష సూచనలు ఉన్నందున బల్దియా అధికారులు, సిబ్బంది అందురూ అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామని జవాన్‌లతో పాటు ప్రత్యేకంగా మాన్‌సూన్ బృందాలు ఫీల్డ్‌లో పని చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ మహేందర్, ఎంహెచ్ఓ రాజేష్, ఇన్‌చార్జ్ ఈఈ సంతోశ్ బాబు, డీఈలు రవి కిరణ్, మొజామిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఏర్పాట్లపై సమీక్ష

హన్మకొండ అర్బన్: ఈనెల 17 నుంచి 22 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలకు జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో దర్గా ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ, బందోబస్తు, తీసుకోవాల్సిన ఇతర జాగ్రత్తలపై బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిలతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉర్సు నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ వై.వి గణేశ్, ఆర్డీఓ రాథోడ్ రమేశ్, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ గౌస్ హైదర్, దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా, డిప్యూటీ కమిషనర్ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి


హసన్‌పర్తి: డెంగీ బాధితురాలితో మాట్లాడుతున్న వాసం వెంకటేశ్వర్‌రెడ్డి

ఎంజీఎం/హసన్‌పర్తి: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యులు అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంజీఎం ఆస్పత్రితోపాటు చింతల్ యూపీహెచ్‌సీ, హసన్‌పర్తి మండలం సిద్ధాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వంగపహాడ్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావుతో కలిసి సందర్శించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని ఫీవర్ వార్డు, ఐసీటీసీ కేంద్రం, రక్తనిధి కేంద్రం, ఫార్మసీ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రం చింతల్‌లో పర్యటించి అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి డెంగీ బాధితురాలైన నజియా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్వర పీడిత ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలన్నారు. స్కూళ్లలో, సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు ఫీవర్ సర్వే చేసి అవసరమైన వారికి టెస్టులు చేయాలన్నారు. క్రమంతప్పకుండా శానిటేషన్ చేయాలని, డ్రై డే పాటించాలని ఆదేశించారు. వైద్యులు అందుబాటులో ఉండాలని, మందుల నిల్వలు సరిపడా పెట్టుకోవాలన్నారు. వంగపహాడ్‌లో డెంగీ పీడిత ప్రాంతాలను సందర్శించారు. డెంగీ బాధితురాలితో మాట్లాడి పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ అశ్విన్, డాక్టర్ శ్రీపాల్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా పన్నులు వసూలు చేయాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్


సమావేశంలో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

రామన్నపేట : కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడి అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ పన్నులు వసూలు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కౌన్సిల్ హాల్‌లో పన్నుల ప్రగతిపై రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్‌లు, ప్రతీరోజు తమకు నిర్దేశించిన వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలన్నారు. పన్ను వసూళ్లలో వెనుకంజలో ఉన్న సిబ్బంది ఈ నెల31లోగా పురోభివృద్ధి చూపించాలని ఆదేశించారు. సుదీర్ఘ కాలంగా పన్ను చెల్లించకుండా పెండింగ్‌లో ఉన్న వారికి నోటీసులు జారీ చేసి వసూలు జరిగేలా చూడాలని, సంబంధిత యాజమానికి చెందిన నల్లాలు తీసివేయడం, డీఆర్ఎఫ్ సిబ్బంది సహకారంతో ఆస్తులు జప్తుచేయాలని పేర్కొన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్, డీఆర్ఎఫ్ సిబ్బంది, డిప్యూటీ కమిషనర్, వార్డు ఆఫీసర్, ఆర్ఐ, ఆర్ఓలు బృందాలుగా ఏర్పడి సమన్వయంతో పెండింగ్ బకాయిలు వసూలు చేయాలన్నారు. వీటికి సమాంతరంగా నల్లా పన్నులు వసలు చేయాలన్నారు. ఈ నెలా చివరిలోగా నల్లా పన్నులు వసూలు 20శాతం, ఆస్తిపన్ను వసూలు 30 శాతం చేరుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

పరికరాలు లేవు.. వైద్యం అందించలేము

- ఫైల్స్ బాధితుడికి చికిత్స అందించేందుకు వైద్యుల నిరాకరణ
- సోషల్ మీడియాలో వైరల్.. హుటాహుటిన బాధితుడి వద్దకు ఎంజీఎం అధికారులు

- వివరాలు 8లో▸

ఒక్కో క్వారీనుంచి లారీ

నెలలో కనీసం 15 ట్రిప్పులు... రూ.3 లక్షలకుపైనే సంపాదన

- ఏజెన్సీ ప్రాంతంలో ఓ ఎస్ఐకి ఇది ఇసుకతో పెట్టిన విద్య
- ఇసుక క్వారీలనుంచి మామూళ్లతోపాటు ఇది అదనం
- డీజీపీ కార్యాలయానికి బాధితుల ఫిర్యాదులు



సాక్షిప్రతినిధి, వరంగల్: ఇసుక దందా ఉమ్మడి వరంగల్‌లోని కొన్ని ఠాణాల పోలీసులకు కాసుల వర్షం కురిపిస్తోంది. పోస్టింగ్ కోసం ప్రయత్నం చేసేటప్పుడే చాలామంది ఎస్ఐలు, సీఐలు ఇసుక అక్రమ దందా సాగే ప్రాంతాలను ఎంచుకోవడమన్నది పరిపాటిగా మారింది. ఏ పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్కువ వాగులు, ఇసుక, మొరం.. బెల్టు షాపుల దందా సాగుతుందో.. ఆ ఠాణాలే లక్ష్యం చేసుకుని చాలామంది పోస్టింగ్‌లు కొడుతున్నారు. ఆ తర్వాత నెలవారీ మామూళ్లు షరా మామూలుగా మారి... ఇసుక వ్యాపారులు తమ దందాను సాగించుకోవడం సర్వసాధారణం. కానీ కొందరు మామూళ్లతోపాటు టెండర్‌ల ద్వారా పొందిన క్వారీల నుంచి పుక్కిడికి లారీల్లో ఇసుక నింపి హైదరాబాద్‌కు పంపుతూ దందా నిర్వహిస్తున్నారు. అదనపు ఆదాయానికి రుచి మరిగిన ఇలాంటి వారు తమకు అనుకూలురైన నాయకులు, అధికారుల పేర్లు వాడుతూ వివాదాస్పదులు అవుతున్నారు. ఇదే తరహాలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంత ఏజెన్సీ ఏరియా ఠాణాలో పనిచేసే సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ఒకరు నెలవారీవి 'మామూలు'గా తీసుకుంటూ ఇసుక దందాను నిర్వహిస్తుండటం ఇప్పుడు పోలీసుశాఖలోనే చర్చనీయాంశంగా మారింది.

ఎస్ఐపై ఫిర్యాదులు..


మామూళ్లు ఇచ్చి దందా చేసుకోవడానికి అలవాటు పడిన ఇసుక వ్యాపారులు.. అదనంగా ఇసుక లారీలను నింపి పంపాలని ఇబ్బందులు పెడుతున్న సదరు ఏజెన్సీ ఠాణా ఎస్ఐపై ఇటీవల డీజీపీ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఆ జిల్లా పోలీసు ఉన్నతాధికారికి కూడా ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సదరు వ్యాపారులు.. ఆ ఉన్నతాధికారి సెలవులో ఉన్నట్లు తెలుసుకుని డీజీపీ, అడిషనల్ డీజీపీలకు పంపినట్లు చెబుతున్నారు. సదరు ఎస్ఐపై ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచిల ద్వారా విచారణ జరిపించి నిజమని తేలితేనే చర్యలు తీసుకోవాలని ఆధారాలతో సహా ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. కాగా ఇసుక దందాపై ఓ సబ్ ఇన్‌స్పెక్టర్‌పై డీజీపీ స్థాయి అధికారికి ఆ ఏజెన్సీ జిల్లా నుంచి ఫిర్యాదు చేయడం ఇదే మొదటిసారి కావడంతో పోలీసుశాఖలో కలకలంగా మారింది.

అధికారికంగా 10 వరకు ఇసుక క్వారీలు ..

గోదావరి పరీవాహక ప్రాంతంలో 10 వరకు ఇసుక క్వారీలు అధికారికంగా నడుస్తున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ముందే అప్రమత్తమైన కాంట్రాక్టర్‌లు వేల క్యూబిక్ మీటర్లను ఇసుకను గోదావరి ఒడ్డున నిల్వచేసి ఆన్‌లైన్ ఆర్డర్‌లపై సరఫరా చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఓ ఠాణాలో పనిచేసే ఎస్ఐ.. ఆ ఠాణా పరిధితోపాటు చుట్టుపక్కల క్వారీల నిర్వాహకులనుంచి ఇసుకను ఉచితంగా నింపిస్తూ హైదరాబాద్‌కు తరలిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఒక్కో క్వారీనుంచి నెలలో రెండు నుంచి మూడు.. నెలలో మొత్తం 15 నుంచి 20 లారీల ఇసుకను సరఫరా చేస్తున్నారు. ఒక్కో లారీ యజమాని, డ్రైవర్‌లకు కిరాయి, డీజిల్ ఖర్చులు పోను రూ.5 వేలు మిగిలేలా చేస్తూ.. నెల మొత్తంలో సదరు ఎస్ఐ కనీసం రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు సంపాదిస్తున్నట్లు చెబుతున్నారు. ఎవరన్న క్వారీ, లారీ యజమానులు సహకరించకపోతే మైనింగ్, టీజీఎండీసీ, రవాణాశాఖ అధికారులతో బెదిరిపులకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- వరంగల్ డీఐఈఓ శ్రీధర్ సుమన్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఐఈఓ శ్రీధర్‌సుమన్

రామన్నపేట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వరంగల్ డీఐఈఓ శ్రీధర్‌సుమన్ సూచించారు. వరంగల్ ఏవీవీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొడిమాల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో బుధవారం 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అధ్యాపకులతో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, అధ్యాపకులు అనిత, సంజీవ, శ్రీధర్, స్వప్న, గోపి, సహిస్తా, దేవిశ్రీప్రసాద్, సాకేత్, నవ్య పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ: వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, వరంగల్ సర్కిల్ ఎస్ఈ కె.గౌతంరెడ్డి తెలిపారు. జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని, మరో నాలుగు రోజులపాటు ఈ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈక్రమంలో వినియోగదారులు, ముఖ్యంగా రైతులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తున్నామని, మెన్, మెటీరియల్ సిద్ధంగా ఉంచుకున్నట్లు తెలిపారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాల్ని సిద్ధం చేసుకున్నామన్నారు. ఉద్యోగులకు షిఫ్ట్ విధానంలో 24 గంటల విధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి విద్యుత్ అంతరాయం ఏర్పడినా పునరుద్ధరణ టీంలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేశామని వివరించారు. హనుమకొండ జిల్లా కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 87124 84506, వరంగల్ జిల్లా కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 87124 84818లో సంప్రదించాలని సూచించారు.

రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్ సంబంధిత పనులు ఎట్టి పరిస్థితుల్లో చేయవద్దని, తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకవద్దని సూచించారు. ప్రమాదకరంగా ఉన్నట్లు గమనిస్తే వెంటనే కంట్రోల్ రూం ఫోన్ నంబర్‌లకు కానీ, టోల్ ఫ్రీ నంబర్ 1912కు కానీ, సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలపాలని సూచించారు.

పరికరాలు లేవు.. వైద్యం అందించలేము

- ఎంజీఎంలో కొనసాగుతున్న రెఫరల్ ట్రీట్‌మెంట్
- మూడు రోజులుగా వైద్యం కోసం క్యాజువాలిటీ ఎదుట పడిగాపులు
- సోషల్ మీడియా కథనాలతో రోగి వద్దకు వైద్యులు



బాధితుడిని వైద్యం కోసం తరలిస్తున్న పరిపాలనాధికారులు

ఎంజీఎం : పూర్తిస్థాయి వైద్యాధికారులు లేకపోవడం, హెచ్‌ఓడీలు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తుండడం, వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు జంకుతుండడం వెరసి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పెద్ద సార్లు ఉంటారు అని భరోసాతో వస్తున్న రోగులకు ఆశించిన మేర వైద్యం అందడం లేదు. అలాంటి ఘటనే ఇది. జూనియర్ వైద్యుల పర్యవేక్షణలో వందలాది మంది రోగులకు చికిత్సలు అందిస్తున్న క్రమంలో పైల్స్‌తో బాధపడే ఓ రోగికి ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యం అందించలేమని గెంటేసినంతా పనిచేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పరిపాలనాధికారులు క్యాజువాలిటీ వద్దకు పరుగులు పెట్టి సదరు రోగిని అడ్మిట్ చేసుకుని చికిత్స అందించడం మొదలు పెట్టారు. వివరాలోకి వెళ్తే.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరు గ్రామానికి చెందిన బాచబోయిన రత్నాకర్ అనే వ్యక్తి కడుపునొప్పి భరించలేక భార్య బుచ్చమ్మతో కలిసి సోమవారం ఎంజీఎం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చారు. పరీక్షలు చేసిన వైద్యులు పైల్స్ సమస్య ఉన్నట్లు గుర్తించారు. వైద్యం చేయడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేవని చెప్పి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి వెళ్లాలని రెఫర్ చేశారు. దీంతో ఏమీ తోచని స్థితిలో సదరు రోగి మూడు రోజులుగా ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న రేకుల షెడ్‌లోనే వేచి ఉన్నాడు. ఈ విషయం బుధవారం సోషల్ మీడియాలో రావడంతో వెంటనే ఎంజీఎం పరిపాలనాధికారులు కార్యాలయాలు వదిలి క్యాజువాలిటీ వద్దకు పరుగులు పెట్టారు. బాధితుడిని స్వయంగా అత్యవసర విభాగంలో చేర్పించి చికిత్స మొదలు పెట్టారు. కాగా, చివరకు మెరుగైన చికిత్స నిమిత్తం మళ్లీ హైదరాబాద్‌కు తరలించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో విద్యార్థి మృతి



షేక్ ఫరాజ్ అహ్మద్ మృతదేహం

శాయంపేట : ట్రాక్టర్ ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండలంలోని నేరేడుపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై పరమేశ్ కథనం ప్రకారం.. ఆత్మకూరు మండలం హౌజుబుజుర్గ్ గ్రామానికి చెందిన షేక్ ఫరాజ్ అహ్మద్ (16) శాయంపేట మండలం నేరేడుపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరి మంగళవారం పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం 4 గంటలకు ఇంటికి వెళ్లే సమయంలో పాఠశాల ఎదుట హౌజుబుజుర్గ్ గ్రామానికి చెందిన షేక్‌షబినాబీకి చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ ఉమర్ నడుపుకుంటూ వస్తుండగా షేక్ ఫరాజ్ అహ్మద్‌తో పాటు కొంత విద్యార్థులు ఎక్కారు. ఈ క్రమంలో నేరేడుపల్లి శివారులోని మలుపు వద్ద డ్రైవర్ బ్రేక్ వేయగా ట్రాక్టర్‌లో కూర్చున్న ఫరాజ్ అహ్మద్ ఎగిరి రోడ్డుపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. వారి వెనుక వస్తున్న అదే గ్రామానికి చెందిన షేక్ కరీం.. ఫరాజ్ అహ్మద్ తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఫరాజ్ అహ్మద్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి షేక్ కమల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటితో ముగింపు

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ల కొనసాగింపేనా?

- 2025, ఫిబ్రవరి 12తో కాలపరిమితి ముగియగా ఆరు నెలలు పొడిగింపు
- నేటితో పూర్తి కానున్న పొడిగింపు పాలకవర్గాల కాలపరిమితి
- అయినా సహకార శాఖలో కనిపించని ఎన్నికల హడావుడి
- ఆరు నెలల వరకు ప్రస్తుత పాలకవర్గాన్ని పొడిగించే అవకాశం



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

హన్మకొండ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గడువు ముగుస్తోంది. దీంతో పాలకవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. తమను పర్సన్ ఇన్‌చార్జ్ చైర్ పర్సన్లుగా, కమిటీలుగా కొనసాగిస్తారా? లేక పదవీ కాలపరిమితి ముగియడంతో వైదొలగాల్సి వస్తోందా అనే మీమాంసంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుత పాలకవర్గం ఎన్నిక ముందు గత పాలక వర్గాన్ని పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగించారు. ఈసారి కూడా ప్రస్తుత పాలక వర్గాలకు ఆరు నెలల పొడిగింపు ఇచ్చారు. పొడిగింపు కాలపరిమితి నేటి(గురువారం)తో ముగుస్తుంది. దీంతో మరోసారి తమకే అవకాశం దక్కుతుందనే ఆశల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్లు ఉన్నారు.

సహకార శాఖలో కనిపించని ఎన్నికల సన్నాహాలు..

ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా ప్రజాపరిషత్‌లు, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాలు సమాయత్తమవుతున్నాయి. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నాయి. అయితే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకవర్గం కాల పరిమితి ముగిసి ఒకసారి పొడిగింపు అవకాశమిచ్చి ఆ కాలపరిమితి కూడా ముగుస్తున్నా ఆ శాఖలో ఎన్నికల సన్నాహాలు కనిపించడం లేదు. దీంతో ఇప్పట్లో సహకార ఎన్నికలు జరిపే అవకాశం కనిపించడం లేదు. ఈ క్రమంలో ప్రస్తుత పాలక వర్గాలు తమకు పొడిగింపు లభించొచ్చని ఆశిస్తున్నాయి.

2020, ఫిబ్రవరి 15న పీఏసీఎస్‌లకు ఎన్నికలు..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 2020 ఫిబ్రవరి 15న ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు జరిగి ఐదు సంవత్సరాలు కావడంతో వీటి కాలపరిమితి ఈ ఏడాది ఫిబ్రవరి 14తో ముగిసింది. అదే విధంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), ఓరుగల్లు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఓడీసీఎంఎస్)ల కాల పరిమితి ఈ ఏడాది ఫిబ్రవరి 29తో ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 99 పీఏసీఎస్‌లు ఉండగా వరంగల్ డీసీసీబీ పరిధిలో 91 సంఘాలున్నాయి. వరంగల్ డీసీసీబీ పూర్వ వరంగల్ జిల్లా పరిధి మేరకు విస్తరించి ఉంది. వరంగల్ డీసీసీబీ పరిధిలో హనుమకొండ జిల్లాలో 14 పీఏసీఎస్‌లు, భూపాలపల్లి జిల్లాలో 6, జనగామలో 14, మహబూబాబాద్‌లో 16, ములుగులో 11, సిద్దిపేటలో 2, వరంగల్ జిల్లాలో 28 పీఏసీఎస్‌లున్నాయి. అయితే నూతనంగా ఏర్పాటైన జిల్లాల వారీగా చూస్తే.. హనుమకొండ జిల్లాలో 16, వరంగల్‌లో 28, జనగామలో 14, మహబూబాబాద్‌లో 19, ములుగులో 12, జేఎస్ భూపాలపల్లి జిల్లాలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి.

మరోసారి అవకాశం లభిస్తుందని పాలకవర్గాల ఆశ..

గత ప్రభుత్వం పీఏసీఎస్‌ల కాలపరిమితి ముగిసినా వాటినే పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగించింది. సహకార చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించలేక పోతే ఆరు నెలల పాటు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించొచ్చు. ఈ మేరకు ప్రస్తుత పాలకవర్గానికి ముందు ఉన్న కమిటీలను ఆరు మాసాల చొప్పున నాలుగు పర్యాయాలు పొడిగింపు ఇచ్చారు. దీంతో వారు అదనంగా రెండు సంవత్సరాల పాటు పదవుల్లో కొనసాగారు. ఈసారి కూడా గతంలో మాదిరి పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా పొడిగింపు ఇచ్చారు. పొడిగింపు కాలపరిమితి ముగియనుండడంతో గతంలో మాదిరిగానే మరోసారి అవకాశం దక్కుతుందనే ఆశలో ప్రస్తుత పాలక వర్గాలున్నాయి. డీసీసీబీలకు కూడా ప్రస్తుత పాలకవర్గాలకు పొడిగింపు ఇచ్చారు. ఓడీసీఎంఎస్‌కు మాత్రం ప్రభుత్వం వరంగల్ అదనపు జిల్లా కలెక్టర్‌ను పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికలు జరగగా చాలా వరకు బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు చైర్మన్లుగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చాలా మంది పీఏసీఎస్ చైర్మన్లు, మెజారిటీ డీసీసీబీ చైర్మన్లు అధికార కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అంతా అధికార పార్టీకి చెందిన వారు కావడంతో మరోసారి తమకు పర్సన్ ఇన్‌చార్జ్ చైర్ పర్సన్లుగా పొడిగింపు లభిస్తుందని ఆశిస్తున్నారు.

16న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

- యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు



మాట్లాడుతున్న యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ సుందర్ రాజు యాదవ్

హన్మకొండ: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఈ నెల 16(శనివారం)న ఘనంగా నిర్వహించనున్నట్లు యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్ తెలిపారు. ఈమేరకు బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ భారత దేశంలోనే అత్యంత భారీగా ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. యాదవ కుల దైవం శ్రీ కృష్ణుడు, బలరాముడని తెలిపారు. ప్రస్తుతం సైన్స్, టెక్నాలజీ మీదనే విద్యార్థులు, యువకుల దృష్టి సారిస్తున్నారు. అందుకే భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర తెలియచెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో మూడేళ్లుగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలకు రాంనగర్ నుంచి శ్రీ కృష్ణుడి శోభాయాత్ర ప్రారంభమై అంబేద్కర్ కూడలి, పోలీస్ హెడ్‌క్వార్టర్, అశోక, బస్టాండ్ కూడళ్ల మీదుగా బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం వరకు సాగుతుందన్నారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజుతో పాటు పార్టీలకతీతంగా నాయకులు పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ జన్మాష్టమీ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధులు కన్నెబోయిన రాజయ్య యాదవ్, గిరబోయిన రాజయ్య యాదవ్, బొంగు అశోక్, కెంచ కుమారస్వామి, రాజేందర్, ఎల్లావుల కుమార్ యాదవ్, రజనీకుమార్, దూడయ్య, చెన్నమల్లు, బుట్టి శ్యాం యాదవ్, బొంగు రాజు యాదవ్ పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి



సుజాత(ఫైల్)

కురవి: పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని తిర్మలాపురంలో చోటు చేసుకుంది. ఎస్సై గండ్రాతి సతీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూల సుజాత (35) మార్చి 10వ తేదీన మొక్కజొన్న చేనులో పనిచేస్తుండగా పాముకాటు వేసింది. దీంతో కుటుంబసభ్యులు మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోమాలోకి వెళ్లింది. దీంతో ఏప్రిల్ 2వ తేదీన హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏప్రిల్ 5వ తేదీన మళ్లీ మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

అంబులెన్స్ తరహా సేవలు..

- టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఎమర్జెన్సీ రీస్టోర్ టీం



వరంగల్ సర్కిల్ పరిధి వరంగల్ టౌన్ డివిజన్‌లో సిద్ధంగా ఉన్న ఎమర్జెన్సీ రీస్టోర్ టీం

హన్మకొండ: విద్యుత్ అంతరాయాల నివారణ, త్వరితగతిన పునరుద్ధరణకు టీజీ ఎన్పీడీసీఎల్ అంబులెన్స్ తరహా సేవలకు సిద్ధమైంది. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు, ఈదురు గాలులు, భారీ వర్షాల నేపథ్యంలో కలిగే విద్యుత్ అంతరాయాలు తగ్గించడంతోపాటు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టడానికి ఎమర్జెన్సీ రీస్టోర్ టీంలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఎమర్జెన్సీ రిస్టోర్ టీం వాహనంతోపాటు సిబ్బంది, మెటీరియల్ నిత్యం అందుబాటులో ఉంటుంది. సమస్య తలెత్తిన క్షణాల్లో ఈ వాహనం అంబులెన్స్‌లా దూసుకెళ్తుంది. జీపీఆర్‌ఎస్ లోకేషన్ ద్వారా వేగంగా చేరుకుని సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. ఈవాహనంలో సంబంధిత మెటీరియల్ థర్మో విజన్ కెమెరాలు, రంపాలు, టార్చ్ లైట్లు, నిచ్చెనలు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, కేబుల్స్, ఇతర విద్యుత్ మెటీరియల్ అందుబాటులో ఉంటాయి. సిబ్బంది 24/7 అందుబాటులో ఉంటూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తారు. భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ సర్కిల్‌లో ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో సిబ్బంది, మెటీరియల్, ఎమర్జెన్సీ రిస్టోర్ వాహనంతో సిద్ధంగా ఉన్నారు. విద్యుత్ సరఫరాలో ఆటంకం కలిగిన వెంటనే చేరుకునేలా సమాయత్తంగా ఉన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా



వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్ అందిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలకు విద్యుత్ అంతరాయం కలిగితే వెంటనే సరఫరా పునరుద్ధరణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. ఈ క్రమంలో ఎమర్జెన్సీ రిస్టోర్ టీంను సిద్ధంగా ఉంచాం. వీరు సమస్య తలెత్తిన వెంటనే వేగంగా చేరుకుని సరఫరా పునరుద్ధరిస్తారు.

\- కె.గౌతం రెడ్డి, ఎస్ఈ, వరంగల్ సర్కిల్

తేలికపాటి నుంచి భారీ వర్షం

- హెచ్చరించిన వాతావరణ శాఖ
- బుధవారం చిరుజల్లులే..

హన్మకొండ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మరో నాలుగు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినా బుధవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉండి అప్పుడప్పుడు చిరుజల్లులు కురిశాయి. సోమవారం కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం అతలాకుతలమైంది. మంగళవారం, బుధవారం రోజంతా భారీ వర్షాలు లేకపోవడంతో జలదిగ్బంధంలో చిక్కుకున్న లోతట్టు ప్రాంత కాలనీవాసులు తేరుకుంటున్నారు. ఇప్పటికీ వరంగల్ మహానగరంలో లోతట్టు ప్రాంతాల్లోని పలుకాలనీల్లో అక్కడక్కడ నీరు నిలిచిఉంది.

హనుమకొండ జిల్లాలో..

మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 వరకు హనుమకొండ జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణశాఖ వెల్లడించింది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసిందని, జిల్లాలో సగటున 34.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. భీమదేవరపల్లి మండలంలో 55.8 మిల్లీ మీటర్లు, వేలేరులో 30.1, ఎల్కతుర్తిలో 21.3, కమలాపూర్‌లో 47, హసన్‌పర్తిలో 20.9, ధర్మసాగర్‌లో 16.5, కాజీపేటలో 12.1, హనుమకొండలో 15, ఐనవోలులో 7.1, పరకాలలో 68.7, దామెరలో 26.7, ఆత్మకూరులో 48.5, శాయంపేటలో 40.9, నడికుడలో 72.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

వరంగల్ జిల్లాలో..

మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం 8.30 వరకు వరంగల్ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. జిల్లాలో సగటున 10.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. ఖిలా వరంగల్‌లో 19.3 మిల్లీ మీటర్లు, వరంగల్‌లో 19, నల్లబెల్లిలో 18.3, దుగ్గొండిలో 17.5, గీసుకొండలో 13.1, ఖానాపురంలో 9.8, నర్సంపేటలో 9.5, చెన్నారావుపేటలో 7.8, సంగెంలో 6.6, వర్ధన్నపేటలో 4.3, పర్వతగిరిలో 4.1, నెక్కొండలో 3.6, రాయపర్తి మండలంలో 2.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

నానో యూరియాతో అధిక దిగుబడి

- వరంగల్ డీఏఓ అనురాధ



మాట్లాడుతున్న వరంగల్ డీఏఓ అనురాధ

నయీంనగర్: నానో యూరియాతో అధిక దిగుబడి వస్తుందని వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) కె.అనురాధ తెలిపారు. బుధవారం హనుమకొండ నయీంనగర్ ప్రెసిడెంట్ దాబాలో ఇఫ్కో ఆధ్వర్యంలో నానో డీఏపీ, నానో కాపర్, నానో జింక్‌పై ఉమ్మడి వరంగల్ జిల్లా రైతు సహకార సంఘాలు, డీసీఎంఎస్, డీలర్లు, అభ్యుదయ రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సంప్రదాయ యూరియాను తగ్గించి నానో యూరియా, నానో డీఏపీ అధికంగా వాడాలని సూచించారు. శాస్త్రవేత్త రావుల ఉమారెడ్డి మాట్లాడుతూ రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని నానో సాంకేతికత పరిజ్ఞానంతో మొదటిసారి యూరియాను ద్రవరూపంలో తీసుకొచ్చిన ఘనత ఓ భారతీయుడిదన్నారు. ఇఫ్కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్, వరంగల్ మార్కెటింగ్ మేనేజర్ విశాల్ షిండే నానో ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డీఏఓలు సురేశ్‌కుమార్, విజయ నిర్మల, శాస్త్రవేత్తలు డీవై.రావు, రాములు, ఏడీఏ కె.దామోదర్ రెడ్డి, వరంగల్ ఏడీ కె.రవీందర్ రెడ్డి, ఏఓ టెక్నికల్ కృష్ణారెడ్డి, రైతులు, ఇఫ్కో సిబ్బంది పాల్గొన్నారు.

కాకతీయుల శిల్పకళ అద్భుతం

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

విద్యారణ్యపురి: కాకతీయుల శిల్పకళ అద్భుతమని, నాటి సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో 'కాకతీయాస్ టెంపుల్స్, ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ప్రారంభ సభలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాకతీయుల కాలంలో వివిధ కట్టడాల్లో నాటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాండ్‌బాక్స్ టెక్నాలజీని ఉపయోగించారన్నారు. ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ కాకతీయుల శిల్పకళా సాంస్కృతిక వైభవాన్ని తెలియజేసేందుకు ఈ వర్క్ షాప్ ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. సాంస్కృతిక పరిశోధకుడు, తెలంగాణ చరిత్ర బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ కీలకోపన్యాసం చేస్తూ దక్షిణాసియాలోనే ప్రసిద్ధ హోజసాల చాళుక్య శైలులతో కూడిన కాకతీయుల శిల్పకళా ప్రసిద్ధిగాంచిందన్నారు. రామప్ప, వెయ్యిస్తంభాల ఆలయాల్లో అద్భుత సౌందర్యం దాగి ఉందన్నారు. వరంగల్ నిట్ విశ్రాంత ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని ప్రకృతి విపత్తులనుంచి పరిరక్షించుకోవాలన్నారు. కేయూహిస్టరీ విభాగం విశ్రాంత ఆచార్యుడు కె.విజయబాబు మాట్లాడుతూ రామప్పదేవాలయంలో మదనిక, నాగిని వంటి శిల్పాల సౌందర్యం 800 సంవత్సరాలనాటి సాంకేతికత నేటితరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అనంతరం కేయూ పాలకమండలి సభ్యుడు మల్లం నవీన్, హెరిటేజ్ యాక్టివిస్ట్ అరవింద్ ఆర్య, చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ అరుణ మాట్లాడారు. ఈ వర్క్‌షాప్‌లో కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు సురేశ్‌బాబు,శ్యామ్యూల్‌ప్రవీణ్‌కుమార్, యుగేంధర్, మధు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

యువతిపై సామూహిక లైంగికదాడి

- ఈ ఘటనలో పది మంది యువకుల అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ పండేరిచేతన్ నితిన్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్

జనగామ రూరల్: ఓ యువతిపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన పది మంది నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జనగామ పట్టణానికి చెందిన ఓ యువతిపై పది మంది యువకులు మహమ్మద్ ఒవైసీ, ముత్యాల పవన్ కుమార్, బొడ్డుల శివ కుమార్, నూకల రవి, జెట్టి సంజయ్, ఎం.డి అబ్దుల్ ఖయ్యూం, పుస్తకాల సాయి తేజ, ముత్తాడి సుమంత్ రెడ్డి, గుండ సాయి చరణ్ రెడ్డి, ఓరుగంటి సాయిరాం లైంగికదాడికి పాల్పడ్డారు. జూన్‌లో బాధితురాలిని సదరు యువకులు ప్రేమ, స్నేహం పేరుతో కారులో తీసుకుని జనగామ-సూర్యాపేట రోడ్‌లో గల 'టీ వరల్డ్' వెనుక ఉన్న ఒక రూమ్‌లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. అందులో ఓ యువకుడు ప్రేమిస్తున్నానని బాధితురాలికి మాయమాటలు చెప్పి గోవాకు తీసుకెళ్లి అక్కడ కూడా పలుమార్లు శారీరకంగా కలిశాడు. ఈ ఘటనపై బాధితురాలి చిన్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం నిందితులు సిద్దిపేట రోడ్డులో ఉన్నారనే సమాచారం మేరకు సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్ అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఏఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యువత మత్తు పదార్థాలు సేవించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అత్యవసర సమయాల్లో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

విద్యుత్ పోటీల్లో వరంగల్ సర్కిల్ అత్యుత్తమ ప్రదర్శన



ఎస్ఈ మధుసూదన్ రావు, డీఈ టెక్నికల్ విజేందర్ రెడ్డికి ట్రోఫీలు అందజేస్తున్న క్రీడాకారులు

- హాకీలో ప్రథమ స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం

హన్మకొండ: టీజీ ట్రాన్స్‌కో, టీజీ డిస్కంల ఇంటర్ సర్కిల్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ సర్కిల్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. కప్‌లు గెలుచుకున్నారు. 2025–2026 సంవత్సరానికి గాను టీజీ ట్రాన్స్ కో, టీజీ డిస్కంల ఇంటర్ సర్కిల్ పోటీలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగాయి. ఇందులో హాకీలో ఉమ్మడి వరంగల్ సర్కిల్ జట్టు ప్రథమ స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించి ట్రోఫీలు అందుకుంది. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ పి.మధుసూదన్ రావు, డీఈ టెక్నికల్, సేఫ్టీ ఆఫీసర్ విజేందర్ రెడ్డిని ఇరు జట్ల క్రీడాకారులు కలిసి ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను అభినందించారు.

అవయవదానంపై అవగాహన ఉండాలి

- తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి



అవయవదానం పై ప్రతిజ్ఞ చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

హన్మకొండ: అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండ బాలసముద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏకశిల పార్కులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ అవయవ దానం అవసరమని చాటి చెప్పేందుకే ప్రపంచ అవయవ దాన దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో అవయవలేమితో ప్రతీ సంవత్సరం ఐదు లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, దేశంలో అవయవదానం రేటు అతి తక్కువ ఉందన్నారు. ప్రతీ 10 లక్షల మందికిగాను 0.65 మంది దాతలుగా ముందుకు వస్తున్నారని వివరించారు. పాశ్చాత్య దేశాలు స్పెయిన్, క్రొయేషియాలో 10 లక్షల మందికి గాను 30 మంది దాతలు అవయవదానానికి ముందుకువస్తున్నారన్నారు. భారతదేశంలోనూ అవయవదాతలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా అవయవదానంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు మల్లారెడ్డి, వేణు, ప్రతినిధులు ఎం.పద్మ, నిమ్మల శ్రీనివాస్, భారతి, విజయ కుమారి, నిర్మల, జనార్దన్ రెడ్డి, సత్యనారాయణ, పుల్లారెడ్డి, రాంబాబు, అంజలి, భాస్కర్, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్వల వాసికి అరుదైన అవకాశం

- ఆసియా పసిఫిక్ గ్రామీణాభివృద్ధి కేంద్రంలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా వెంకటమల్లు నియామకం



వెంకటమల్లు

కేసముద్రం: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో రీసెర్చ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మహబూబాబాద్ జిల్లా కేసముంద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన తాడబోయిన వెంకటమల్లు అంతర్ ప్రభుత్వ సంస్థ సెంటర్ ఆన్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ ఏషియా అండ్ పసిఫిక్ (సీఐఆర్‌డీఏపీ)లో ప్రోగ్రాం ఆఫీసర్‌గా నియామకమయ్యారు. 15 దేశాల్లో గ్రామీణాభివృద్ధి పేదరిక నిర్మూలన కోసం ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆ సంస్థలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు వెంకటమల్లును అభినందించారు. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో ఉన్న ఆ సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా తనను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు వెంకటమల్లు పేర్కొన్నారు.

పంద్రాగస్టుకు కోట ముస్తాబు



ఏర్పాట్లు చేయిస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: స్వాతంత్ర్య వేడుకలకు ఖిలా వరంగల్ కోట ముస్తాబవుతోంది. కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. భారీ వర్షాలతో ఖుష్‌మహల్ ప్రాంగణం మొత్తం బురద మయమైంది. దీంతో బుధవారం ఉదయం నుంచే అధికారుల పర్యవేక్షణలో మొరం, స్టోన్ డస్ట్ పోసి చదును చేస్తున్నారు. ఒక పక్క వర్షం పడుతున్నా పంద్రాగస్టుకు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. పనులు వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.